నిర్దేశిత సమయాల్లోనే అనుమతి

- భారీ వాహనదారులకు ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు సూచన
- ఇప్పటివరకు 252 భారీ వాహనాలపై 158 క్రిమినల్ కేసులు నమోదు

బొల్లారం, మార్చి 4: భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించడం వల్ల రోడ్డు ప్రమాదాలు, తీవ్ర ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. మంగళవారం కమిషనర్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్ సీవీ ఆనంద్, అడిషనల్ కమిషనర్ ట్రాఫిక్ జోయెల్ డేవిస్, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు ట్రాఫిక్ నార్త్ జోన్ ఏసీపీ శంకర్ రాజు, తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధు బాబు, సిబ్బందితో కలిసి తిరుమలగి శివారులోని హకీంపేట్ నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ వద్ద భారీ, అతి భారీ వాహనాలు హైదరాబాద్ నగరంలోని ప్రవేశించకుండా ఉండేవిధంగా సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. భారీ వాహనాలు నగరంలోనికి వారి ఇష్టానుసారంగా రావడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు సంభవించి రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు.

తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హకీంపేట శివారులో సూచిక బోర్డును ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, సీఐ మధుబాబు, సిబ్బంది

ప్రమాదాల వల్ల బాధిత కుటుంబాలు మొత్తం రోడ్డున పడే పరిస్థితి నెలకొందన్నారు. ట్రాఫిక్ జామ్ ఏర్పడి అత్యవసర సమయాల్లో ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇదే విషయాన్ని నగర కమిషనర్ భారీ, అతి భారీ వాహనాల ప్రవేశాన్ని నిషేధిస్తూ గత నెల 20న ఉత్తర్వులను జారీ చేశారని గుర్తు చేశారు. దీనిలో భాగంగానే మంగళ వారం హకీంపేట్ గ్రామ శివారులో పెద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేశామని దీనిలో స్పష్టంగా వాహనాల ప్రవేశ, నిషిద్ధ సమయాలు పేర్కొన్నట్లు వివరించారు. భారీ వాహన యజమానులు, డ్రైవర్లు సూచిక బోర్డు అనుసరించి తమ వాహన కేటగిరీని బట్టి వారికి నిర్దేశించిన సమయాల్లో మాత్రమే నగరంలోకి ప్రవేశించాలని సూచించారు. ప్రమాదాల నివారణలో పాలుపంచుకోవాలని నగర ట్రాఫిక్ పోలీసు, తిరుమలగిరి పోలీస్ తరపున విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ప్రమాదాల నివారణకు, భారీ వాహనాల నియంత్రణ కోసం ప్రతిరోజూ నిబంధనలకు విరుద్ధంగా వచ్చే వాహనాలపై జరిమానా విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 158 క్రిమినల్ కేసులు 252 వాహనాలపై నమోదు చేశామన్నారు. అదేవిధంగా 3796 వాహనాలపై జరిమానా విధించామని ఏసీపీ శంకర్ రాజు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రెడ్యానాయక్, హెడ్ కానిస్టేబుల్ దీను ప్రకాష్, కానిస్టేబుల్ రవికాంత్, వెంకటరమణ, మహేష్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

జెమినీ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మార్చి 4: బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. ముషీరాబాద్ డివిజన్ జెమినీ కాలనీలో ఎన్నికల సమయంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జెమినీ కాలనీ, దాయర మార్కెట్, మణెమ్మ గల్లీలో పాద యాత్ర నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెమినీ కాలనీ వాసులు కలుషిత నీటి సరఫరా జరుగుతుందని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఫిర్యాదు చేశారు. వీధి దీపాలు పనిచేయడం లేదని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా దాయార మార్కెట్లో తవ్విన రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని, దుమ్ము ధూళి సమస్య అధికమైందని ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే దయార మార్కెట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. జెమినీ కాలనీలో కలుషిత నీటి సమస్య వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించడానికి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మణెమ్మ గల్లీలో డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు కోసం వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈలు సన్ని, గీత, జలమండలి డీజీఎం మోహన్ రాజ్, మేనేజర్ శివ, బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, శ్రీధర్‌రెడ్డి, శంకర్ ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్‌దయాల్ రెడ్డి, అరుణ్ కుమార్, డేవిడ్, బల్ల శ్రీనివాస్ రెడ్డి, మమ్మద్ ఖదీర్, నేత శ్రీనివాస్, సురేందర్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ మణెమ్మ గల్లీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని స్థానిక బస్తీ వాసులు ఎమ్మెల్యే ముఠా గోపాల్ కు విజ్ఞప్తి చేశారు. తమ బస్తీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, కూల్చిన వ్యర్థాలను తొలగింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. డ్రైనేజీ పైప్ లైన్‌ను ఆధునికరించాలని బస్తీవాసులు ధర్మ, సతీష్‌యాదవ్, శ్రీనివాసరావు, మోహన్, విశాలి, రాజ్యలక్ష్మి, జుబేదా సుజాత, సంధ్య, వీరమణి, లక్ష్మిలు కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సమస్యలు వివరిస్తున్న మణెమ్మగల్లీ వాసులు

ఎంబీఏ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్మెంట్- ఈవినింగ్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 11వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ రెగ్యులర్ పరీక్ష ఫలితాలతో పాటు డిగ్రీ కోర్సుల సప్లమెంటరీ రివాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

పీహెచ్‌డీ సబ్మిషన్ గడువు పొడిగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని 2018 బ్యాచ్ పరిశోధక విద్యార్థులు థీసెస్ సమర్పించేందుకు గడువును ఏడాది పొడిగించాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఓయూ అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య ఒక ప్రకటన విడుదల చేశారు. 2018 పరిశోధక విద్యార్థుల ప్రవేశాలు 2019 వరకు సాగాయన్నారు. కరోనాతో రెండేళ్ల కాలాన్ని పరిశోధకులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెలోషిప్ లేక పరిశోధనలు ముందుకు సాగలేదని వాపోయారు. యూజీసీ రెండేండ్లు పొడిగించినప్పటికీ ఓయూ పాటించడం లేదని మండిపడ్డారు. గడువుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల గ్రామీణ పేద విద్యార్థులు నష్టపోతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు.

మహిళా పురస్కారాలు ప్రదానం

పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ముషీరాబాద్, మార్చ్ 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో మహిళా పురస్కారాలు ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పాల్గొని మహిళలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని అన్నారు. ఆర్థిక స్వాతంత్రం ఉన్నప్పుడే వారికి కుటుంబం పరంగా సమాజంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆత్మీయ నిర్మల, సోరంపూడి శ్రీమణి, చల్లా సౌభాగ్య లక్ష్మి, కంచి రాజు శ్రీలత వర్మలకు మహిళా శక్తి పురస్కారంలో అందజేశారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

బొల్లారం, మార్చి 4: కంటోన్మెంట్ పరిధి సిఖ్ విలేజ్‌సెక్యూర్ వాల్యూ ఇండియా లిమిటెడ్ కార్యాలయం వద్ద కార్మికులు జీతాలు చెల్లించటం లేదని మంగళవారం అందోళనకు దిగారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీతాలు చెల్లించాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఈ సెక్యూర్ వాల్యూ ఇండియా లిమిటెడ్ సిఖ్ విలేజ్ కార్యాలయంలో దాదాపు 120మంది 12 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరేండ్లుగా జీతాలు పెంచకున్నా పని చేస్తున్నామని తెలిపారు. మూడు నెలల నుండి జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. విషయం లేబర్ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చాలి చాలని జీతాలతో కాలం ఎల్లదీసుకుంటూ వస్తున్న తమకు జీతాలు చెల్లించక పోవడంతో పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలు చెల్లించ లేక అవస్థలు పడుతున్నట్లు వాపోయారు. ఈ సంస్థ దేశవ్యాప్తంగా ఉన్నదని పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కల్పించుకొని కార్మికులకు న్యాయం చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని, సీఎం రేవంత్ రెడ్డికి విన్నవించుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ నిరసన లో రంజిత్ కుమార్, శ్రీనివాస్, శివకుమార్, రజినీకాంత్, మురళి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

తిరుమలగిరిలో జనఔషధి వేడుకలు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బొల్లారం, మార్చి 4: తిరుమలగిరిలో జన ఔషధీ వేడుకల్లో భాగంగా మాతృ శక్తి కి ఔర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గోపు రమణారెడ్డి, లక్ష్మి స్థానిక పాఠశాలలోని విద్యార్థులకు జన ఔషధీ సువిధ శానిటరీ నాప్కిన్స్, కప్పులు, జామెట్రీ బాక్సులను అందజేశారు. అనంతరం రమణారెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళల శక్తి వంతీకరణతో పాటు ఆరోగ్య శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిల్పారెడ్డి, మీనాక్షి, మానసిక వికలాంగుల కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య


ఈస్ట్ మారేడ్‌పల్లి ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొన్న మదన్‌మోహన్‌రెడ్డి

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 4: ఈస్ట్ మారేడ్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మండల విద్యాధికారి మదన్ మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల పిల్లలు ఎందులోనూ తక్కువ కాదు అని అన్నారు. అన్ని రకాల సౌకర్యాలతో, అనుభవం గల ఉపాధ్యాయులతో నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలీలావతి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అరుణ, మంగమ్మ, మంజుల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కళాకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, మార్చి 4: కళాకారుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి రూ.10వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ కళాకారుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఆలన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ కళాకారుల వేదిక(టీకేవీ) రాష్ట్ర కన్వీనర్ మోహన్ బైరాగి అధ్యక్షతన మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవులు, కళాకారుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాన్ని చాటిచెప్పి, రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా ఉన్న తెలంగాణ ఉద్యమ కవులు, కళాకారుల వృత్తులు దెబ్బతిని ఉపాధి కోల్పోయిన వారిని అన్నిరకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యమ కళాకారులు పాల్గొన్నారు.

8న శారదా విజయం సాహిత్య రూపకం

నవ్య సాహితీ సమితి, నవ్య నాటక సమితి సంస్థల సంయుక్తంగా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 8న బొగ్గులకుంటలోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో శారదా విజయం సాహిత్య రూపకం నిర్వహించనున్నట్లు నవ్య నాటక సమితి అధ్యక్షుడు వేమరాజు విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలో కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఖజానా లెక్కల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వసుంధర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు.

విజయ కుమార్‌కు ఓయూ డాక్టరేట్

విజయకుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగంలో తోకల విజయకుమార్ డాక్టరేట్ సాధించారు. డాక్టర్ కొరెముల శ్రీనివాస్ పర్యవేక్షణలో 'పబ్లిక్ అండ్ ప్రైవేట్ బ్యాంకుల్లో డిజిటల్ బ్యాంకిం గ్ వినియోగంపై రిస్క్ అండ్ రివార్డ్స్-కస్టమర్ల ప్రభావం' అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించిన పరిశోధన గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆయనకు పీహెచ్డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుర్చపల్లికి చెందిన ఆయన తెలంగాణ వర్సిటీలో ఎంకామ్ పూర్తి చేసి నెట్, జేఆర్ఎఫ్, సెట్ అర్హత సాధించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా, సెట్ అర్హత సాధించారు. ప్రస్తుతం ఆయన సికింద్రాబాద్ పీజీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

బీఎస్ఎఫ్ మహాసభ విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఐదో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని బీఎస్ఎఫ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో రూపొందించిన మహాసభ కరపత్రాన్ని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పిడమర్తి రవి హాజరై మాట్లాడుతూ మార్చి 15న భారతదేశ బహుజన సిద్ధాంత కర్త, బహుజన్ సమాజ్‌పార్టీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షీరాం జయంతిని పురస్కరించుకుని ఐదో రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల న్యూ సెమినార్ హాల్లో నిర్వహించనున్న సభకు రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ రాపోలు రాములు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మీసాల మల్లేశం, మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామగల్ల సుందర్, ముస్లిం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రహీం, బీఎస్ఎఫ్ గ్రేటర్ అధ్యక్షుడు మొగిలిగిద్ద ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడుగుల శివ, కల్వకుర్తి శ్రీశైలం, ఆరెకంటి శ్రీకాంత్, గోవిక్, సాయిలు, ఉదయ్, రమేష్, సైదులు, మోహన్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను దేశ రెండో రాజధానిగా చేయాల్సిందే

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: దేశ రెండో రాజధానిగా హైదరాబాద్ కాకుండా అడ్డుకుంటామని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం రెడ్డి ప్రకటించడం అంటే అంబేద్కర్‌ను అవమానించడమేనని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. తార్నాకలోని జేఏసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కంటే హైదరాబాద్ దేశ రెండో రాజధాని అయితే 100 రెట్లు అధికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ విషయంలో బహిరంగ చర్చకు తాను సిద్ధమని సవాల్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే తన సవాల్‌ను ప్రొఫెసర్ కోదండరాంరెడ్డి స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్లు సుంకే సంపత్, శంకర్ పాల్గొన్నారు.

'విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు'

వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం గాంధీ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కె.రాజేష్‌రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారితో కలిసి ఆయన ఆస్పత్రి వార్డులో రోగులతో మాట్లాడి, వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. - బన్సీలాలపేట

అధికారులపై చిర్రుబుర్రు..

ప్రతిరోజూ ఓపీ విభాగం ఉదయం 9:30 నుంచి 12:30 వరకే పనిచేస్తుంది. ఒంటి గంటకు ముగుస్తుంది. మధ్యాహ్నం 1:15కు ఓపీ విభాగానికి వచ్చిన మంత్రి, డాక్టర్లు కనిపించక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ ఎక్కడుందని ప్రశ్నించారు. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉంటుందని చెప్పినా.. పట్టించుకోలేదు. ఐవీఎఫ్ కేంద్రం ఇన్‌చార్జి ఆపరేషన్ థియేటర్‌లో ఉన్నారని చెప్పినా అసహనం వ్యక్తం చేశారు.

పరీక్షల సమయంలో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు అజిత్ కళ్యాణ్ తదితరులు

బొల్లారం, మార్చి 4: పదో తరగతి, ఇంటర్ పరీక్షల విద్యార్థులను పరీక్షల సమయంలో ఇబ్బందులు పెట్టవద్దని ఎమ్మార్పీఎస్ నాయకులు అజిత్ కళ్యాణ్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు. మంగళవారం బాపూజీనగర్‌లోని ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. పలు విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఫీజులు కట్టాలంటూ, హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తెలిసిందన్నారు. ఫీజు బకాయి ఉంటే పరీక్షల తర్వాత వసూలు చేసుకోవాలే తప్ప, ఇదే అదునుగా విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. క్షోభకు గురిచేసే విధంగా వ్యవహరించే వారిపై ఉద్యమం తప్పదని అన్నారు. సమావేశంలో శ్రీకాంత్, రామారావు, అశోక్, బాబిందర్ పాల్గొన్నారు.

ప్రతిజోన్‌లో రూ.25 కోట్ల అభివృద్ధి పనులు

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలిచి ఉన్ని విధాల సహకారాన్ని అందిస్తుందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బేగంపేట్ సర్కిల్‌లో రూ.59.40లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే గణేష్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డిలతో కలిసి మేయర్ శంకుస్థాపన చేశారు. మోండా మార్కెట్ డివిజన్‌లో మూడు ప్రాంతాల్లో రూ.32.50 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం, ఈస్ట్ మారేడ్‌పల్లిలో రూ.25.50 లక్షల వ్యయంతో వీడీసీసీ రోడ్డు, ఈస్ట్ మారేడ్‌పల్లిలో రూ.1.40లక్షలతో పార్కు కాంపౌండ్ వాల్ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో అభివృద్ధి పనులకు గానూ ప్రతి జోన్‌కు రూ.25కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామని మేయర్ విజయలక్ష్మి తెలిపారు.

చరిత్ర మూలాలపై ఉపన్యాసం

ఇటీవల బయల్పడిన శాసనాలపై విద్యార్థులకు వివరిస్తున్న శ్రీనివాసన్

బేగంపేట మార్చి 4: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం విస్తృత ఉపన్యాసం నిర్వహించారు. తెలుగు వర్సిటీ ప్రొఫెసర్ ఎంఏ శ్రీనివాసన్ వక్తగా హాజరయ్యారు. తెలంగాణ చారిత్రక మూలాలపై విశ్లేషించారు. రాష్ట్రంలో జరిగిన తవ్వకాల్లో బౌద్ధంపై విస్తృత సమాచారాన్ని శాసనాల ద్వారా సేకరించినట్లు తెలిపారు. చరిత్రను నూతన దృష్టి కోణంతో చూడాలని విద్యార్థులకు వివరించారు. బుద్ధుడి కాలంలోనే బౌద్ధం రాష్ట్రంలో వ్యాపించిందన్నారు. శ్రీనివాసన్ సేకరించిన శిలాజ ప్రదర్శనను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. చరిత్ర విభాగం సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సంధ్యజ్యోత్స్న, అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణప్రియ, స్నేహ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహులు, వైస్‌ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ విజయరాఘవ, డాక్టర్ కమల, డాక్టర్ రామాచారి ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జెక్‌కాలనీలో ఘనంగా మహిళా దినోత్సవాలు

అమీర్‌పేట్, మార్చి 4: జెక్‌కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. మహిళా కమిటీ, కిట్టి పార్టీ బృందాల ఆధ్వర్యంలో రోడ్ నంబర్ వన్‌లోని విజయ గ్రాండ్యూర్ అపార్ట్మెంట్స్‌లో వివిధ విభాగాల్లో మహిళలకు నిర్వహించిన పోటీలతో పాటు తంబోలా ఆటలు ఉత్సాహంగా సాగాయి. కాలనీకి చెందిన ముగ్గురిలో ఒకరిని లక్కీ ఉమెన్‌గా, మరో ఇద్దరిని జెక్‌కాలనీ మహారాణులుగా ప్రకటించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. నిర్వాహకులు ఎస్.అన్నపూర్ణ, చింతిరెడ్డి ప్రభ, లంకా హైమావతి, కృష్ణకుమారి, పూర్ణిని భాగ్యలత, శారద, వాణి, హరిత, మాధవి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన ఈఈ

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం నూతన ఈఈగా బాధ్యతలు స్వీకరించిన కవిత నగర డిప్యూటీ మేయర్ శ్